మీరు ఏర్పరుచుకున్న నమ్మకాలే మీ జీవితాన్ని నడిపిస్తున్నాయి. కాబట్టి మీ జీవితం మారాలి అంటే మీరు ఎరుకలో ఉండి నమ్మకాలను మార్చాలి. అప్పుడే మీరు కొత్త కొత్త అనుభవాలను పొందుతారు. లేకుంటే అవే పాత అనుభవాలు కొనసాగుతాయి. కాబట్టి మీరు మాట్లాడే ప్రతి మాటను, అలాగే ప్రతి ఆలోచనను గమనిస్తూ, వాటికి సంబంధించిన నమ్మకాలను వదిలేసి కొత్త నమ్మకాలను ఏర్పరుచుకోండి.

దృష్టిని బట్టి సృష్టి, స్థితిని బట్టి గతి, యద్భావం తద్భవతి అనే అపరిమితమైన నమ్మకాలను (UnLimited Beliefs) ఏర్పరుచుకుని వాటిని మీరు గట్టిగా పట్టుకోండి. ఎందుకంటే ఇవి మీకు ఎప్పుడు కొత్త కొత్త అనుభవాలను ఇస్తూనే ఉంటాయి కాబట్టి. మీ దృష్టిని, మీ స్థితిని, మీ భావనను మార్చుకున్న వెంటనే, దానికి తగ్గట్టు బాహ్యంగా ఫలితం కూడా మారుతుంది.

## Limited Beliefs

కాబట్టి చలనం లేని పరిమితమైన నమ్మకాలను (Limited Beliefs, Controlled Beliefs) లేదా స్థిరమైన అభిప్రాయాలను, అంటే...

బీపీ ఇంతే ఉండాలి, షుగర్ ఇంతే ఉండాలి,

శరీరం యొక్క బరువు ఇంతే ఉండాలి,

ఇది మంచి ఆహారం, అది చెడ్డ ఆహారం, అనారోగ్య సమస్యలకు పరిష్కారం లేదు,

ఆర్థికంగా ఎప్పుడు లోటు ఉంటుంది, బంధాలకు అతీతంగా చేరలేము,

కోపం ఉండకూడదు, ఎప్పుడూ శాంతంగానే ఉండాలి,

ఇది మంచి గుణం, అది చెడ్డ గుణం,

ఇది పాపం, అది పుణ్యం, పాప-పుణ్యాలకు అతీతంగా చేరలేను,

ప్రారబ్దం ప్రకారమే మన జీవితం నడుస్తుంది, అనుకున్న వెంటనే ఫలించదు,

నేను మంచిగా లేదా ప్రశాంతంగా ఉంటేనే దేవుడు ప్రత్యక్షమౌతాడు,

ఇది మంచి ప్రదేశం, అది చెడ్డ ప్రదేశం, ఇది కలుషిత వాతావరణం,

ఇది మాయా ప్రపంచం, నేను ఒకసారి ఒకే శరీరంలో ఒకే ప్రాంతంలో ఉంటాను,

ఇది మంచి కాలం, అది చెడ్డ కాలం, ఇది మంచి సమయం, అది చెడ్డ సమయం,

ఈ గ్రహాలు మంచివి, ఆ గ్రహాలు చెడ్డవి,

ఇది కలియుగం, నాది పరిమిత శరీరం, నాది పరిమిత మనసు,

నా ఇంద్రియాలు శరీరం వరకే పరిమితమై ఉన్నాయి... మొదలగు ఎదుగుదలకు అవకాశం లేని నమ్మకాలను వదిలేయండి. ఎందుకంటే ఇవి మిమ్మల్ని పరిమితం చేసి బంధిస్తాయి కాబట్టి.

## UnLimited Beliefs

కనుక నేను సూచించే ఈ స్వేచ్ఛతో కూడిన నమ్మకాలను ఎంపిక చేసుకోండి (Choose Freedom Beliefs, UnLimited Beliefs):

నేను పెట్టుకునే సంకల్పానికి నేను పోషించే పాత్రకు తగ్గట్టు –

బీపీ షుగర్ రీడింగ్స్ ఉండాలి, శరీరాకృతి ఉండాలి, శరీర బరువు ఉండాలి,

అన్ని దివ్యమైన ఆహారాలే, అన్ని దివ్యమైన గుణాలే, అన్ని దివ్యమైన కాలాలే,

అన్ని దివ్యమైన సమయాలే, అన్ని దివ్యమైన ప్రదేశాలే, అన్ని దివ్యమైన గ్రహాలే,

అన్ని దివ్యమైన యుగాలే, ఇది దివ్యమైన వాతావరణం,

నేను ఎలా ఉన్నా దేవుడు ప్రత్యక్షమౌతాడు,

ఇది దివ్యమైన ప్రపంచం, నేను ఒకేసారి అనేక శరీరాలలో అనేక ప్రాంతాలలో ఉంటాను,

అనంతమైన విశ్వ శరీరమే నా శరీరం, అనంతమైన విశ్వ మనసే నా మనసు,

నా ఇంద్రియాలు అనంతంగా విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి,

అన్ని అనారోగ్య సమస్యలకు దివ్యమైన పరిష్కారం ఉంది,

ఆర్థికంగా ఎప్పుడు సమృద్ధిగా ఉంటాను,

బంధాలకతీతంగా సులభంగా చేరుతాను,

పాపపుణ్యాలకు అతీతంగా సులభంగా చేరుతాను,

అనుకున్న వెంటనే ఫలిస్తుంది,

శరీరం ఎలా ఉన్నా నేను ఆనందంగా ఉంటాను,

మనసు ఎలా ఉన్నా నేను ఆనందంగా ఉంటాను,

బుద్ధి ఎలా ఉన్నా నేను ఆనందంగా ఉంటాను,

ఎవరు ఎలా ఉన్నా నేను ఆనందంగా ఉంటాను,

ప్రపంచం ఎలా ఉన్నా నేను ఆనందంగా ఉంటాను,

సమస్యలలో కష్టసుఖాలలో కూడా నేను ఆనందంగా ఉంటాను,

ఉచ్చ-నీచ స్థితులలో కూడా నేను ఆనందంగా ఉంటాను,

వర్తమాన స్థితి ఎలా ఉన్నా నేను ఆనందంగా ఉంటాను,

ప్రారబ్ధం ప్రకారం కాకుండా ఆనందంగా ఉన్నప్పుడు నేను ఏది అనుకుంటే అది జరుగుతుంది...

ఈ విధమైన స్వేచ్ఛతో కూడిన నియమాలులేని (unconditional) నమ్మకాలను గట్టిగా పట్టుకోండి. ఎందుకంటే నేను అంటేనే దేని మీద ఆధారపడని ఆనందం (Independent Bliss).

కనుక పరివర్తనకు అవకాశం లేని నమ్మకాలను గట్టిగా పట్టుకోవడం మూఢనమ్మకమే అవుతుంది. ఎందుకంటే కదిలే శక్తి యొక్క తత్వం ఎప్పుడు మారుతూ పరివర్తన చెందుతూనే ఉండడం. కనుక పరిమిత నమ్మకాలన్నీ మూఢనమ్మకాలేనని ఇక్కడ గ్రహించండి.

అందువలన మీరు ఎప్పుడూ తెరిచిన మనసుతో, తెరిచిన హృదయంతో ఉండండి.

అంటే యద్భావం తద్భవతి, దృష్టిని బట్టి సృష్టి, స్థితిని బట్టి గతి,

ఏదైనా సరే అనుకున్న వెంటనే ప్రత్యక్షమౌతుంది మాయమౌతుంది...

ఇలాంటి స్వేచ్ఛతో కూడిన అపరిమితమైన నమ్మకాలను గట్టిగా పట్టుకోండి.

## ఒరిజినల్ దైవం-Man Made God

ఈ సృష్టిలో కదలని శక్తి చైతన్యం 50%, అన్ని వైపులా కదిలే నిరాకార శక్తి-చైతన్యం 49%, శక్తి-చైతన్యంతో తయారైన నామరూపక్రియలు 1% ఉంటాయి. అంటే నిరాకారం 99% - ఆకారాలు 1%; కదిలేవి 50%, కదలనిది 50% ఉంటాయన్నమాట. ఈ నిరాకార శక్తి-చైతన్యం యొక్క కలయికను సచ్చిదానంద స్వరూపం అని కూడా అంటారు.

ఈ కదిలే 49% శక్తి అలాగే కదలని 50% శక్తి - ప్రత్యక్షం అవ్వకుండా ఎవరు ఏది అడ్డుకోలేవు. ఎందుకంటే ఇవి సూక్ష్మాతి సూక్ష్మంగా ఉండి, సదా ప్రత్యక్షమయ్యే(Omnipresent) ఉంటాయి. అలాగే ఈ దైవం నిరాకారంగా ఉంటూనే, జీవజగదీశ్వర్లుగా కూడా ఒకేసారి నటిస్తున్నాడు (Monism). కనుక నిరాకారాన్ని మరియు ఆకారాన్ని విడదివ్వలేము. అవి ఎప్పుడు పాలు నీళ్ళలా, బొమ్మ బొరుసులా కలిసి ఏకమయ్యే ఉంటాయి.

కనుక అన్నింటినీ చూస్తున్నప్పుడు - ఇది నిరాకారమని, అది ఆకారమని, ఇది ఆరోగ్యమని అది అనారోగ్యమని, ఇది మంచిదని, అది చెడ్డదని, ఇది కుర్చీ అని, అది మంచం అని, ఇది ప్రపంచమని, మనం జీవులమని, ఎక్కడో దేవుడు ఉన్నాడని, ఇలా అన్నింటినీ నిర్ణయించి, వాటిని నామరూప క్రియలతో బంధించి, దానిని గుడ్డిగా నమ్మకండి.

ఎందుకంటే మీకు ఎంత పెద్ద సమస్య ఉన్నా దాని విలువ కేవలం 1% మాత్రమే, అలాగే నేను మాటల రూపంలో చెప్పే ఎంత గొప్ప పరిష్కారమైన దాని విలువ కూడా 1% మాత్రమే.

కనుక దేనిని చూస్తున్నా…

నేను రూపంగా 1% నిరాకారంగా 99% ఉన్నాను,

నువ్వు కూడా రూపంగా 1% నిరాకారంగా 99% ఉన్నావు అని జడ్జ్ చేయండి.

అంటే నువ్వు పరిమితంగా 1% అపరిమితంగా 99% ఉన్నావు, నేను పరిమితంగా 1% అపరిమితంగా 99% ఉన్నాను అని జడ్జ్ చేయండి. కాబట్టి 1% మాత్రమే ఉన్న ద్వంద్వాల మీద దృష్టి పెట్టకుండా, 99% ఉన్న మౌనం లేదా దైవం లేదా ఏకత్వం మీద మీ దృష్టిని నిలపండి.

అలాగే దైవం లేదా శక్తి-చైతన్యం సహాయం చేయకుండా నేను ఏమి చేయలేను, దైవం చేతిలో నేను కీలుబొమ్మను, ఉన్నది అపరిమితమైన నేనునే అపరిమిత దైవమే (Omnipresence means all-present), అసలు పరిమితమైన నేనుకు ఉనికే లేదు కనుక స్వయంగా నేను ఏమి చేయలేనని, అజ్ఞానం వలన పాప పుణ్యాలు నేనే చేశానని ఇంత వరకు గుడ్డిగా నమ్మాననే విషయాన్ని మీరు గుర్తించండి.

ఇన్ని రోజులు నేను చేసిన పాపాల వల్లనే దైవం ప్రత్యక్షం కావట్లేదు అని మనం గట్టిగా నమ్ముతున్నాం. కనుక కర్మ-తలరాత-ప్రారబ్ధం అందుకే దైవం ప్రత్యక్షం కావట్లేదు, ఇలాంటి నమ్మకాలను కూడా గట్టిగా పట్టుకోకుండా, వాటితో అంటి ముట్టనట్టుగా ఉండండి.

నా పరిమిత నమ్మకాలకు ప్రభావితమై అంతటా ప్రత్యక్షం కాలేని దైవం నాకు వద్దు అని భావిస్తూ ఆ దైవాన్ని వదిలేయండి. ఎందుకంటే మన అవగాహనను, మన అనుభవ జ్ఞానాన్ని ఆధారం చేసుకొని మనమే ఈ దైవాన్ని ఊహించి సృష్టి చేశాం కనుక (Man made God). ఇతను మనల్ని సృష్టించిన ఒరిజినల్ దైవం కాదు కనుక.

## వర్ణనాతీతం

సృష్టించిన వాడికి సృష్టి మీద హక్కు ఉండదు అనే నమ్మకాలు మనకు ఉన్నాయి. ఇక్కడ జీవ జగదీశ్వరులు సృష్టి, అపరిమిత దైవం సృష్టికర్త(Omnipotence, meaning all-powerful). సృష్టించిన దైవానికి సృష్టి మీద సర్వహక్కులు ఉంటాయి. ఆయన ఎప్పుడంటే అప్పుడు దేనినైనా సృష్టించి ఇక చాలు అని అనుకున్న వెంటనే దానిని లయం కూడా చేయగలుగుతాడు.

జరిగినది జరుగుతున్నది జరగబోయేది అంతా పర్ఫెక్ట్‌గా దివ్యంగా ఉంది అనే భావనలో సదా ఉంటాడు, ఎందుకంటే తనకు అన్యం లేదు కనుక. ప్రతి కదలిక భగవంతుడే, మనమే కదులుతున్నాం అని భ్రమ పడుతున్నాము. కనుక మన జీవితం మన చేతిలో ఏమాత్రం లేదు, గతము భవిష్యత్తు వర్తమానాల గురించి తెలిసిన దైవం చేతిలో(Omniscience, meaning all-knowing) అంతా ఉన్నదని గ్రహించి దైవానికి సరెండర్ అవ్వండి.

ఒరిజినల్ దైవం యొక్క స్థితిని, ఆయన గుణగణాలను, ఆయన స్పందించే తీరును, ఆయన ఎవరికి ముక్తిని ప్రసాదిస్తాడు మొదలైన విషయాల గురించి మనం మాటలలో స్పష్టంగా వర్ణించి చెప్పలేము. ఎందుకంటే ఆయన వర్ణనాతీతుడు, అలాగే ఆయన చర్యలు కూడా వర్ణనకు అతీతంగా ఉంటాయి. అందువలన మన చర్యలతో, మన బుద్ధితో, మన సాధనతో దైవాన్ని అదుపు చేయగలమని,

దైవాన్ని ఆకర్షించగలమని గట్టిగా నమ్మకండి. కనుక దైవం మరియు దైవ సృష్టికి సంబంధించి మనకు ఉన్న అన్ని నమ్మకాలను వదిలేసి ప్రశాంతంగా మౌనంగా ఉండడమే ఉత్తమం.

ఇక్కడ దైవం తప్ప రెండవది లేనే లేదు కాబట్టి ఆయన గురించి మనం మాటలలో వర్ణించి చెప్పలేము. మనం మాట్లాడకుండా ఉండలేం కాబట్టి మన మాటలు చివరికి మౌనానికే దారితీయాలి. అలాగే దైవం మనల్ని సృష్టించాడని మనం భావిస్తే, దైవంలో నుంచి దైవమే వస్తాడు మానవుడు రాలేడు. కారణంలో నుంచి కారణమే వస్తుంది కార్యం రాదు. పూర్ణంలో నుంచి పూర్ణమే వస్తుంది అసంపూర్ణం రాదు. కాబట్టి మన నామరూపక్రియలను కూడా మాటలలో వర్ణించలేము. ఎందుకంటే మన నామరూపక్రియలు కూడా దివ్యమైనవే కనుక.

రెండవది ఉన్నప్పుడే దానిని అర్ధం చేసుకోగలం మాటలలో వర్ణించగలం. కాని ఒకటే ఉంటే అర్ధం చేసుకోవడానికి వర్ణించడానికి ఏమీ ఉండదు. కేవలం దానితో ఏకమవ్వాలి తప్ప ఇంకేమీ చేయలేము. నిద్రలో మనం అదే చేస్తున్నాము, కాని అక్కడ మనకు ఎరుక ఉండడం లేదు. నిద్రలో కూడా ఎరుక ఉంటే అదే ముక్తస్థితి. కనుక అన్ని పరిస్థితులలో మీరు మాటలలో వర్ణించలేని స్థితికి చేరి, దానిలో తగినంత సమయం ఎరుకలో ఉన్నప్పుడే బ్రహ్మానందస్థితి లేదా సచ్చిదానందస్థితి ప్రత్యక్షమౌతుంది.

కనుక మీకున్న సమస్యకు కారణం - వాడు, అతడు, ఇది-అది లేదా నేను లేదా పరమాత్మ అని మీరు మాటలలో వర్ణించలేని స్థితికి వచ్చినప్పుడే మీకు దివ్యమైన స్థితి ప్రత్యక్షమౌతుంది, అలాగే ఫలితం కూడా వెంటనే లభిస్తుంది. అంటే పరమాత్మ కూడా కారణం అని చెప్ప లేని స్థితి ఏర్పడాలి. ఈ స్థితి ఏర్పడకుంటే మనం కార్యం, పరమాత్మ కారణం అవుతాడు. ఇలా కారణాన్ని కార్యాన్ని స్పష్టంగా వర్ణించి మాటలలో చెబితే మీరు ఒకటికంటే ఎక్కువ వాస్తవంగా ఉన్నాయని నమ్ముతున్నట్టు. దీని వలన ద్వంద్వ ప్రపంచంలో మీరు పరిమిత భాగమౌతారు. అప్పుడు మాయా ప్రపంచం మిమ్మల్ని కీలుబొమ్మలా ఆడిస్తుంది.

కనుక అది కారణం, ఇది కార్యం అని మాటలలో బంధించి స్పష్టంగా ఎవరైన చెబితే, వాడు పూర్ణ జ్ఞాని కాదని గ్రహించి, పరిమితమైన మాటలు 1% మాత్రమేనని అపరిమితమైన మౌనం 99% అని జడ్జ్ చేయండి. కనుక మీరనుకున్నది సాధించాలంటే, ఆ సమస్య మరియు దాని పరిష్కారం గురించి

మాటలలో వర్ణించలేని స్థితికి చేరి, మీరు ఆ వర్ణనాతీతస్థితితో లేదా మౌనంతో తగినంత సమయం ఏకమై ఉంటేనే, మీరు అనుకున్నది సృష్టించు కోగలుగుతారని ఇక్కడ గ్రహించండి.

## సమస్య-పరిష్కారం

అలాగే అనారోగ్య లేదా ఆర్థిక లేదా మరేదైనా ఒక సమస్య తీసుకుని దానికి సంబంధించిన నమ్మకాలు ఎలా మార్చాలి, దీని గురించి వివరించండి అని నన్ను అడుగుతున్నారు. దీనికి నా సమాధానం ఏంటంటే, ఇక్కడ సమస్య అనారోగ్యమో లేదా ఆర్థికమో కాదు. టోటల్ ప్రపంచమే సమస్య. ఎందుకంటే ప్రపంచంలో సమస్యనే ఉంటుందేగానీ పరిష్కారం ఉండదు. ఇంకా చెప్పాలి అంటే ప్రపంచంలో సమస్య కాదు, ప్రపంచమే సమస్య. ఒకవేళ మీకు ఈ ప్రపంచంలో పరిష్కారం లభించిన  అది తాత్కాలిక ఉపశమనాన్నే ఇస్తుంది.

అనారోగ్యానికి కారణం చెడు ఆహారమని వాతావరణమని ఇలా రకరకాలుగా మనం ఈ ప్రపంచంలోనే వెతుకుతూ ఉంటాం. అలాగే ఆరోగ్యానికి కూడా కారణం ఇక్కడే వెతుకుతాం. కానీ ఇవన్నీ సృష్టి అయినవి (Creations). ఒక సృష్టి మరొక సృష్టికి కారణం కాదు, సృష్టించిన వాడే ఆ సృష్టికి కారణం. మంచి ఆహారం ఆరోగ్యానికి సృష్టికర్త కాదు, చెడు ఆహారం అనారోగ్యాన్ని సృష్టి చేయలేదు. ఎందుకంటే ఇవన్నీ సృష్టి  కనుక, మీతో సహా ఇవన్నీ కూడా ఒకేసారి పుట్టి పెరిగి అంతమౌతున్నాయి కనుక. అంటే ఈ మాయా ప్రపంచం అనే సినిమాలో ఒక పాత్రను మరొక పాత్ర సృష్టి చేయలేదని, సూత్రధారి లేదా డైరెక్టరే పాత్రలను మరియు పాత్రల కష్టసుఖాలను సృష్టి చేస్తున్నాడని ఇక్కడ గ్రహించండి.

ఈ ప్రపంచాన్ని సృష్టించిన సృష్టికర్త(creator), ప్రపంచం పుట్టక ముందే ఉండి, ప్రపంచానికి అతీతంగా ఉంటాడే గాని ప్రపంచంలో ఏదో ఒకచోట పరిమితంగా బందీ అయి ఉండడు. అలాగే ఈ దైవానికి చావు-పుట్టుకలు ఉండవు. కనుక ఆరోగ్యాన్ని-అనారోగ్యాన్ని ఎవరైతే సృష్టించాడో వాడే కారణం. ఇక్కడ అనారోగ్య- ఆరోగ్యం, పాజిటివ్- నెగిటివ్ న్యూట్రల్.. ఇలా అన్నింటినీ సృష్టించినవాడు దైవం. కనుక ఆ దైవమే మూలం కారణం.

కనుక ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా, ఈ అతీతంలో ఉన్న దైవంతో ఏకమవ్వాలి కాబట్టి, ఏదో ఒక సమస్య మీద దృష్టి పెట్టకుండా, టోటల్ ప్రపంచాన్ని సమస్యగా భావించి, ప్రపంచానికి సంబంధించిన నమ్మకాలు మార్చాలి. అప్పుడే అతీతంగా ఉన్న దైవం ప్రత్యక్షమౌతాడు. కాబట్టి మీరు ఏది చూస్తున్న అది 1% మాత్రమే పరిమితంగా ఉంది, 99% అపరిమితంగా ఉంది అని జడ్జ్ చేయండి.

అలాగే శరీరం వరకే పరిమితమై ఉన్న కష్టసుఖాలు మిమ్మల్ని ఇబ్బంది పెడతాయి. ఎందుకంటే వాటిని మీరు శరీరం వరకే పరిమితం చేసి బంధిస్తున్నారు. దీని వలన మీరు కూడా స్వేచ్ఛను కోల్పోయి శరీరం వరకే పరిమితమౌతున్నారు. కాబట్టి నాతో సహా నాకు ఉన్న కష్టసుఖాలన్నీ విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి అని భావించండి. అప్పుడు పరిమితంగా ఉన్న కష్టసుఖాలన్నీ దివ్యమైన శక్తులుగా పరివర్తన చెందుతాయి.

ఉదాహరణకు కాళ్ళ దగ్గరే నొప్పి ఉంటే, ఆ నొప్పి కేవలం కాళ్ళ దగ్గరే ఉంది అని మీరు భావించి, దానిని మీరు కేవలం అక్కడే అనుభూతి చెందితే, అది మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. అలా కాకుండా నొప్పి శరీరం అంతా విశ్వమంతా వ్యాపించి ఉందని భావించి దానిని అనుభూతి చెందితే, అప్పుడు మీకు అది ఆనందానుభూతిని ఇస్తుంది. అలాగే మంచి లేదా తటస్థం లేదా దివ్యానుభూతులను ఏదో ఒక భాగంలో అనుభూతి చెందితే, మొదట్లో మీకు హాయిగా ఉండవచ్చు. కాని అది కూడా కొంత సమయం తర్వాత దుఃఖాన్ని కలిగిస్తుంది, ఎందుకంటే వాటిని మీరు పరిమితంగా చేసి బంధిస్తున్నారే గాని, వాటి సహజ స్థితియైన అపరిమిత తత్వాన్ని తెలుసుకుని వాటిని అపరిమితంతో ఏకం చేయడం లేదు కనుక.

వాస్తవానికి మీతో సహా లోపల-బయట ఉన్న అన్ని శక్తులు ఒకేసారి అపరిమితంగా ఉంటూనే పరిమితంగా కూడా ఉన్నట్టు నటిస్తున్నాయి. అంటే ఉన్నది అపరిమితమే, పరిమితమైన దానికి ఉనికే లేదు, పరిమితమైనది నీడలాంటిది. కనుక ఏ శక్తి అయినా పరిమితంగా ఉంది అని భావిస్తే అది మిమ్మల్ని ఇబ్బంది పెడుతుందని, ఎప్పుడూ అపరిమితంగా పరిమితంగా ఒకేసారి ఉంటుంది అని భావిస్తే, అది దివ్యమైన శక్తిగా పరివర్తన చెందుతుందని దివ్యమైన ఫలితాలను కూడా అందిస్తుందని ఇక్కడ గ్రహించండి.

అలాగే ఈ దైవం నేనే సృష్టికర్తను నేనే సృష్టిని, ఉన్నది నేనే ఉన్నది ఏకమే, నా గురించి మాటలతో వర్ణించి స్పష్టంగా చెప్పలేరు అని అంటున్నాడు కాబట్టి, ఈ మాటలన్నింటినీ వదిలేసి వర్ణనాతీతస్థితికి చేరండి.

## Divine Will-Free Will

కనుక నేను ఎలా ఉన్నా, ఎలా ప్రవర్తించిన ఎలాంటి నమ్మకాలను గట్టిగా పట్టుకున్నా, అలాగే జీవుళ్ళు, జగత్తు, ఈశ్వరుడు, మాయాశక్తి మొదలైన వాటి ప్రభావం నా మీద ఎంత ఉన్నా కూడా, ఇవేవి అపరిమితమైన దైవంతో నేను ఏకం అవ్వకుండా అడ్డుకోలేవు, ఎందుకంటే అందరినీ కీలు బొమ్మలా ఆడించేది ఈ అపరిమితమైన దైవమే. దీనిని గ్రహించి, ఈ భావాన్ని ఈ నమ్మకాన్ని గట్టిగా పట్టుకోండి.

మీరు ఎలా ఉన్నా ఏ పరిస్థితుల్లో ఉన్నా, మీరు పిలిచినా పిలువకపోయినా, పరిమితమైన నమ్మకాలతో మిమ్మల్ని మీరు నిర్బంధించుకున్నా కూడా, అపరిమిత దైవం తన ఇష్టానుసారంగా మీ జీవితంలో ప్రత్యక్షమౌతాడు అలాగే మాయమౌతాడు కూడా. అలాగే మీరు ఊహించని ఫలితాలను ఇస్తాడు, అలాగే మీ వద్ద ఉన్నవి ఊహించని విధంగా లాక్కుంటాడు కూడా. ఇక్కడ మీరు దైవాన్ని ఏమాత్రం అదుపు చేయలేరు. దీనిని భగవదిచ్ఛ (Divine Will) అని అంటారు.

ఒకవేళ వర్తమానస్థితిలో ప్రశాంతంగా తగినంత సమయం మీరు ఉంటే - మీతో సహా దేనిని మార్చవలసిన అవసరం లేదు, అంతా పర్ఫెక్ట్ గా జరుగుతోంది అందరూ పర్ఫెక్ట్ గా ఉన్నారు, సృష్టి అంతా పర్ఫెక్ట్‌గా ఉంది అనే దివ్యానుభవం మీకుంటే, నేను తప్ప ఇంకెవరూ లేరు అనే ఏకత్వానుభవం మీకుంటే(Oneness), పరమాత్మ నువ్వు తప్ప ఇంకెవరూ లేరు అనే ఏకత్వానుభవం మీకుంటే (Singularity, Unity), అప్పుడు మీకు సంకల్ప స్వేచ్ఛ (Free Will) లభిస్తుంది. ఇలాంటి దివ్యమైన స్థితితో మీరు ఏకమై ఉన్నప్పుడు, కోరిన అనుభవాన్ని మీరు వెంటనే సృష్టించుకోగలుగుతారు. అంటే మీరు కూడా పరమాత్మలాగా సృష్టి స్థితి లయాలు చేయగలుగుతారన్నమాట.

కనుక మీ వద్ద ఉన్నది పరమాత్మ అకస్మాత్తుగా లాక్కుంటే, లేదా ప్రారబ్దం ప్రకారం మీకు ఏదైనా సమస్య వస్తే, అప్పుడు మీ సంకల్ప-స్వేచ్ఛను ఉపయోగించుకొని మీరు  మీ సమస్యకు వెంటనే పరిష్కారాన్ని పొందవచ్చు లేదా మీకు కావలసిన దానిని వెంటనే సృష్టించుకోవచ్చు అనే విషయాన్ని ఎల్లప్పుడూ ఈ ద్వంద్వ ప్రపంచంలో ఉన్నప్పుడు మదిలో ఉంచుకోండి.

అంటే ద్వంద్వ ప్రపంచంలో లేదా మాయ ప్రపంచంలో మనం పరిమితమైన భాగంగా ఉంటే మనకు సంకల్ప స్వేచ్ఛ ఉండదని, ఏకత్వ ప్రపంచంతో లేదా దివ్యమైన ప్రపంచంతో ఏకమై ఉంటేనే మనకు సంకల్ప స్వేచ్ఛ ఉంటుందని ఇక్కడ గ్రహించండి.

## సాధన

క్వాంటం ఫిజిక్స్ ప్రకారం ఈ సృష్టిలో ఉన్న ప్రతీ అణువు 1% మాత్రమే ఆకారంతో(Particle), 99% నిరాకారం(Wave)తో తయారైంది. కనుక మీరు కళ్ళు తెరిచి ఎరుకలో ఈ ప్రపంచంతో ఉన్నప్పుడు, ఇంద్రియాల ద్వారా మీరు బయట లోపల దేనిని గ్రహించినా, ఇది 1% మాత్రమే ఆకారమని(శబ్ద స్పర్శ రూప రస గంధాలు, see smell taste touch hear), 99% నిరాకారమని (Independent Bliss) జడ్జ్ చేయండి.

అలాగే మీ జీవితంలో ఏది జరుగుతున్నా, దేనినీ మార్చాల్సిన అవసరం లేదు, అంతా పర్ఫెక్ట్ గా జరుగుతోంది, అందరూ దైవం సహాయంతో దివ్యంగా ఉంటూ దివ్యమైన పనులు చేస్తున్నారు, సృష్టి అంతా పర్ఫెక్ట్ గా ఉంది, అంతా దివ్యంగా జరుగుతోంది అనే భావనను ఎల్లప్పుడూ కొనసాగించాలి. ఒకవేళ మీకు ఇది తప్పు ఇది ఒప్పు అని అనిపిస్తే, మీరు తప్పు-ఒప్పులలో ఇరుక్కుంటే, మీ జీవితంలో అనుకున్న విధంగా జరగట్లేదని అనిపిస్తే, వెంటనే ఆ భావనను మార్చి అంతా పర్ఫెక్ట్ గా జరుగుతోందని అంతా దివ్యంగా జరుగుతోందని జడ్జ్ చేయండి. ఇలా మీరు జడ్జ్ చేస్తూ ఈ దివ్యానుభూతిని కొనసాగించినప్పుడే మీకు సంకల్ప స్వేచ్ఛ ఉంటుందని గుర్తుపెట్టుకోండి.

కనుక  జీవితంలో ఎదురౌతున్న పరిస్థితులకు తగ్గట్టు బయట నటిస్తూ, లోపల 1% మాత్రమే ఉన్న మంచి-చెడులకు గెలుపోటములకు విలువను ఇవ్వకుండా, ముందు మీరు అంతా దివ్యంగా

జరుగుతోందనే భావనకు ప్రాముఖ్యతనిస్తూ, ఈ భావాన్ని ఈ అనుభూతిని అంతరంలో కొనసాగించండి. ఎందుకంటే మన లక్ష్యం గెలుపోటములు కాదు, సంకల్ప-స్వేచ్ఛ కనుక. దైవ సృష్టిలో ఉన్న అన్నింటినీ ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించి (Accept as it is) అన్నింటినీ సమానంగా గౌరవించినప్పుడే, మనకు సంకల్ప స్వేచ్ఛ (Free Will) లభిస్తుంది కనుక. ఎందుకు ఓడిపోతున్నామో, ఎందుకు గెలుస్తున్నామో అర్థం కాని అయోమయ స్థితిలో ఉండకుండా, సంకల్ప స్వేచ్ఛతో అనుకున్న వెంటనే సృష్టిస్థితిలయాలు చేయడమే మన లక్ష్యం కనుక.

మీరు కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్నప్పుడు 1% మాత్రమే ఉన్న పరిమిత ఆకారాలను, ఆలోచనలను, అనుభూతులను, అన్ని వ్యతిరేకాలను, అన్ని ద్వంద్వాలను, అన్ని అపరిమితమైన నమ్మకాలను, అన్ని సమస్యలను మరియు అన్ని పరిష్కారాలను, ఒరిజినల్ దైవం-Man Made God ను, Divine Will-Free Will ను, నేను మీకు ఇన్ని సంవత్సరాల నుండి చెప్పిన జ్ఞానాన్ని, అలాగే మీకు తెలిసిన మొత్తం జ్ఞానాన్ని, చివరికి అన్ని మాటలను కూడా వదిలేసి, తగినంత సమయం ప్రశాంతంగా లేదా మౌనంగా ఉంటే లేదా వాటితో అంటి ముట్టనట్టుగా ఉంటే, లేదా వర్ణనాతీత స్థితిగా ఉంటే, ఆనంద స్థితి లేదా నిరాకార స్థితి దానంతటదే ప్రత్యక్షమౌతుంది.

ఎలాగైతే ఉప్పును నీళ్లలో కలపడం వలన ఉప్పదనం అనేది నీళ్లు మొత్తం వ్యాపిస్తుందో, అలాగే 1% పరిమిత మంచి-చెడు ఆకారాలను పరిమిత-అపరిమిత నమ్మకాలను, ప్రత్యక్షమైన 99% అనంతమైన నిరాకార స్థితిలో కలపండి. ఇలా ఏకం చేయడం వలన ఆకారాలు కూడా అనంతమౌతాయి. అలాగే మీరు కూడా అనంతంతో ఏకం అవ్వండి. ఇలా పరిమితమైనవి అనంతం అవ్వడం వలన, జీరో స్టేట్ లేదా శూన్యస్థితి లేదా ఏకత్వ స్థితి లేదా బ్రహ్మానంద స్థితి ప్రత్యక్షమౌతుంది.

ఇలా ఆకారాలు అంటే దేశకాలవస్తువులు, జీవజగదీశ్వర్లు, ప్రారబ్ధం ఆగామి సంచిత కర్మలు, గతము భవిష్యత్తు వర్తమాన జ్ఞాపకాలు, పాజిటివులు నెగెటివులు న్యూట్రల్లు, జీవాత్మలు ఆత్మలు పరమాత్మలు... మొదలైనవన్నీ నిరాకారంతో కలిసి ముద్దగా ఏకమవ్వడం వలన, ద్వంద్వ విభజన మాయమై ఏకత్వం ఏర్పడుతుంది. ఏకత్వస్థితిలో, ముద్ద స్థితిలో, సచ్చిదానంద స్థితిలో అన్ని ఇప్పుడే ఇక్కడే ఈ క్షణంలోనే ఉంటాయి.

మీకు మరియు మీకు కావాల్సిన దానికి మధ్య దూరం ఉన్నప్పుడే, అనుకున్నది జరగడానికి సమయం పడుతుంది. కానీ ఏకత్వ స్థితిలో మీకు మరియు మీకు కావాల్సిన దానికి మధ్య దూరం అనేదే ఉండదు. కాబట్టి అనుకున్న వెంటనే మీ సంకల్పం నెరవేరుతుంది. ఇలా అనుకున్న వెంటనే ప్రతి దానిని సృష్టిస్తూ (Create Instant Results), నేనే సృష్టికర్తను అని అనుభవపూర్వకంగా తెలుసుకోండి.

నమ్మకాలు టాపిక్‌ని ఆడియోల రూపంలో వినడానికి ఈ లింకును క్లిక్ చేయండి

https://youtube.com/playlist?list=PL7sfndcUtXfnCxnPiGEJDrQUCkXHcllbI&si=6Ez06Obd3kk55jW9

కష్ట-సుఖాలను అమృతంగా పరివర్తన చేయడం ఎలా అనే విషయం తెలుసుకోవడానికి ఈ లింకులను క్లిక్ చేయండి..

https://www.youtube.com/post/Ugkxytw_ftw4Io5Qt22_sqhu-qybCJ7kAQ9L

కరిగిపోండి గైడెడ్ మెడిటేషన్ చేయడానికి ఈ లింకును క్లిక్ చేయండి.

https://www.youtube.com/watch?v=zZuyTTKSIs4&t=0s

ముద్ద గైడెడ్ మెడిటేషన్ చేయడానికి ఈ లింకును క్లిక్ చేయండి.

https://www.youtube.com/watch?v=_cmfTekSJpE&t=0s